
సాక్షి ఒడిశా

బుధవారం । 5 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,03,990లు, బంగారం 830 మిల్లీగ్రాములు, వెండి 10గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కాసీపూర్‌లో ఓఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ పర్యటన

- 8లో



గాంధేయ ఉద్యమం!

- 8లో

న్యూస్‌రీల్

శారదాపూర్ సర్పంచ్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని బీడీఓ ప్రీతమ్‌కు అందిస్తున్న సిహిడియా

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి శారదాపూర్ సర్పంచ్ రూపాలి సిహిడాయా తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు మునిగుడ బీడీఓ ప్రీతమ్‌కుమార్ తంతికి తన రాజీనామా పత్రాన్ని మంగళవారం అందజేశారు. గత కొన్నాళ్లుగా తన ఆరోగ్యం బాగోలేక పోవడంతో ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు సహకరించలేక పోతున్నానని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గత పంచాయతీ ఎన్నికల్లో ప్రత్యర్థిపై 200లకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందిన ఆమె.. పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి తనదైన శైలిలో కృషి చేశారు. అయితే గత 6నెలలుగా ఆరోగ్యం సహకరించ పోవడంతో ప్రజాసేవ చేయలేక పోతున్నానని విచారం వ్యక్తంచేవారు.

బీజేడీలో ఉన్నా..

- రాయఘడ ఎస్‌డీసీ చైర్మన్ బిజయ గమాంగో



విలేకర్ల సమావేశంలో బిజయ గమాంగొ, తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: పార్టీ మారినట్లు తనపై వస్తున్నవి తప్పుడు ప్రచారాలని రాయఘడ బ్లాక్ స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్, అమడా పంచాయతీకి చెందిన బిజయ గమాంగొ ఖండించారు. తాను బీజేడీ లోనే ఉన్నానని స్పష్టంచేశారు. ఈ మేరకు రాంనగర్‌లోని హైటెక్ ప్లాజాలో పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహితో కలిసి మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కేంద్ర మాజీమంత్రి, సుందర్‌ఘడ్ ఎంపీ జుయెల్ ఓరం ఈనెల 1న గుమ్మా సమితిలో పర్యటించిన సందర్భంగా వ్యక్తిగత పరిచయంతో ఆయనను కలిశానని, అంతమాత్రాన బీజేపీ కండువా కప్పుకోలేదని వెల్లడించారు. అలాగే పార్టీ నాయకులతో తనకు విభేదాలు లేవని వివరించారు. సమావేశంలో ఆర్ఎంసీసీ అధ్యక్షుడు ఎస్.గజపతిరావు, సీనియర్ నాయకులు బసంత్ దాస్, జేమ్స్ రైకా, రూపేష్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ కోర్టు ప్రారంభం



బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్ పండా

బరంపురం: రాష్ట్రప్రభుత్వ నిధులు రూ.కోటి వ్యయంతో బరంపురం మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ఆధ్వర్యంలో నిర్మించిన ఇండోర్ బ్యాట్‌మెంటన్ కోర్టును ఎమ్మెల్యే విక్రమ్ పండా మంగళవారం ప్రారంభించారు. నగరంలోని లంజిపల్లి ప్రాంగణంలో ఏర్పాటైన దీనిని స్థానిక యువత, చిన్నారులు సద్వినియోగించు కోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఎంసీ కమిషనర్ సోనాల్ జెన్నా, బీజేడీ గంజాం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌చంద్ర చావ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యాత్ర




గృహోపకరణ సామగ్రి వద్ద మహిళలు

పర్లాకిమిడి: పౌర్ణమి పూర్తయినా పర్లాకిమిడి రాజవీధిలో రథయాత్ర కొనసాగుతోంది. పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, కటక్ తదితర ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు కొందరు తిరిగి స్వస్థలాలకు వెళ్లిపోగా, మరికొందరు మాత్రం మరో 2, 3 రోజులు దుకాణాలు కొనసాగించేందుకు స్థానిక మున్సిపాలిటీ అధికారుల అనుమతి కోరారు. ఈ మేరకు యాత్ర ప్రాంగణంలోని ఎగ్జిబిషన్, స్టాళ్లు, గృహోపకరణ, అలంకరణ సామగ్రి వద్ద కొలుగోలుదారుల సందడి కనిపించింది.

మరమ్మతులే.. ముంచాయి!

- బహనాగా బజార్ దుర్ఘటనలో ఎటువంటి కుట్రకోణం లేదు
- ఘటనకు ముందు చేపట్టిన సర్క్యూట్ పనుల్లోనే తప్పిదం
- బోర్డుకు నివేదిక అందించిన రైల్వే సేఫ్టీ కమిషనర్
- రైల్వేశాఖకు సైతం వివిధ సూచనలు చేసిన కమిటీ



భువనేశ్వర్:

బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వే స్టేషన్‌లో జరిగిన ఘోర విషాదానికి ముందు చేపట్టిన మరమ్మతులే ప్రధాన కారణమని రైల్వే సేఫ్టీ కమిషనర్(సీఆర్ఎస్) విచారణ నివేదిక వెల్లడించింది. ప్రమాదంలో ఎటువంటి కుట్రపూరమైన చర్యలు లేవని ఊహాగానాలకు తెరదించింది. సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్(ఎస్అండ్‌టీ) విభాగంలోని లోపాలను ఎత్తి చూపుతూ రైల్వేబోర్డుకు నివేదిక సమర్పించింది. సిగ్నలింగ్ వ్యవస్థ నిర్వహణలో తాజా పరిస్థితుల ఆధారంగా చర్యలు చేపట్టక పోవడంతోనే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటన జరిగిందని స్పష్టం చేసింది. 5ఏళ్ల క్రితం చేసిన మార్పులు ప్రస్తుతానికి సరితూగకపోవడం, దుర్ఘటనకు కొన్ని గంటల ముందు చేపట్టిన మరమ్మతులు బెడిసి కొట్టినట్లు పేర్కొంది.

లోపాలు సరిదిద్ది ఉంటే..!

విచారణ ప్రారంభంలో రైల్వేమంత్రి అశ్విన్ శ్రీవైష్ణవ్ సూచించిన విధంగా ఈ దుర్ఘటన వెనుక విధ్వంసం చేయాలనే కుట్ర ఉంటుందేమోననే అనుమానాన్ని భద్రతా కమిషన్ తోసిపుచ్చింది. ఘోరమైన ఈ రైలు ప్రమాదానికి మానవ తప్పిదమే కారణమని స్పష్టం చేసింది. జూన్ 2న జరిగిన రైలు ప్రమాదంలో 293మంది మృతి చెందగా.. వెయ్యి మందికి పైగా గాయపడటానికి 'తప్పుడు సిగ్నలింగ్' ప్రధాన కారణమని సీఆర్ఎస్ చేపట్టిన విచారణ గుర్తించింది. సిగ్నలింగ్, టెలీ కమ్యూనికేషన్ విభాగంలో 'బహుళ స్థాయిల్లో లోపాలను' నివేదికలో ప్రధానంగా పేర్కొన్నారు. ప్రమాద సంకేతంగా సకాలంలో ఎర్ర జెండాలు వినియోగించి ఉంటే ఈ విషాదాన్ని నివారించడం సాధ్యమేనని పేర్కొంది. ఐదేళ్ల క్రితం స్టేషన్‌లో లెవెల్ క్రాసింగ్(ఎల్‌సీ) గేట్-94 కోసం ఎలక్ట్రిక్ లిఫ్టింగ్ అవరోధం(ఎల్‌ఈబీ)ని భర్తీ చేసే సమయంలో చోటుచేసుకున్న పొరపాటే తప్పిదానికి కారణమైనట్లు విచారణలో ఖరారైంది. సిగ్నలింగ్, టెలీ కమ్యూనికేషన్ విభాగంలో లోపాలు సరిదిద్ది ఉంటే విషాదం జరిగేదని కాదని తెలియజేసింది. 2018లో చోటు చేసుకున్న పొరపాటును గుర్తించి, తదనుగుణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంతో కారణంగానే సిగ్నలింగ్ నియంత్రణ వ్యవస్థలో 'అసాధారణ ప్రవర్తన' తలెత్తిందని వివరించింది. ఈ పరిస్థితిని గుర్తించడంలో సిగ్నలింగ్, ట్రాక్ సిబ్బందితో పాటు స్టేషన్ మాస్టర్ విఫలమైనట్లు వేలెత్తి చూపింది.

లోపాలు సరిదిద్దాలనుకొని..

ప్రమాదం జరిగిన ప్రదేశానికి సమీపంలో మరమ్మతుల పనులకు అవసరమైన ఆమోదిత సర్క్యూట్ మ్యాప్ అందుబాటులో లేకపోవడంతో తప్పుడు వైరింగ్‌కు దారితీసింది. ఆరోజు సాయంత్రం 6.55 గంటలకు రైలు ప్రమాదం సంభవించగా, సాయంత్రం 4.20 నుంచి 4.50 గంటల మధ్య సర్క్యూట్ మార్పిడి పనులను పాత మ్యాప్ ఆధారంగా చేపట్టారు. దీంతో వైరింగ్‌లో తప్పిదం జరిగి, ఫలితంగా లోపాల సవరణ బదులుగా ఘోర ప్రమాదాన్ని ప్రేరేపించింది. ఈ కార్యకలాపాల్లో నలుగురు సభ్యుల బృందం పాల్గొంది. వీరిలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్(సిగ్నల్) అమీర్‌ఖాన్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఇన్‌చార్జి(సిగ్నల్) ఏకే మహంత, బహనాగా బజార్ స్టేషన్ టెక్నీషియన్ అవినాష్‌రంజన్ మహంతి, బాలాసోర్ స్టేషన్ టెక్నీషియన్ పప్పు కుమార్ ఉన్నారు. గతంలో నార్త్ సిగ్నల్ 'గూమ్టీ' వద్ద, లెవెల్ క్రాసింగ్ గేట్ 94కి సంబంధించిన సిగ్నలింగ్ సర్క్యూట్ మార్పులో లోపాలు తప్పుడు సిగ్నలింగ్‌కు కారణమై షాలీమార్-చెన్నై కోరమండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(12841) లూప్ లైన్‌లో నిలబడి ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టిందని సీఆర్ఎస్ విచారణ నివేదించింది.

సూచనలు..

- గతంలో తప్పుడు వైరింగ్, కేబుల్ లోపం కారణంగా 2022 మే 16న బంక్రా నయాబజార్ స్టేషన్‌లో ఇలాంటి ఘటన జరిగినా తప్పులు సరిదిద్దుకోలేదని నివేదికలో పేర్కొన్నారు.
- విపత్తు నిర్వహణలో సత్వర ప్రతి స్పందనకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. విపత్తు, ప్రతి స్పందన వ్యవస్థను సమీక్షించాలని, జాతీయ విపత్తు ప్రతి స్పందన దళం(ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళంతో(ఎస్డీఆర్ఎఫ్) సమన్వయం చేసుకోవాలని రైల్వేశాఖకు సూచించింది.
- సిగ్నలింగ్ నిర్వహణ, సవరణ, సర్దుబాటు, మార్పిడి ఇతరేతర చర్యల్లో తప్పిదం, లోపాల నివారణకు తాజా మ్యాప్‌లు వంటి సమాచారం నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు.
- అనుబంధ కాగిత పత్రాలు, తాజా నియమ నిబంధనలు ఎప్పటికప్పుడు సవరిస్తూ ఉండాలని సూచించారు.
- అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రామాణిక పద్ధతుల అనుసరణతో ఆమోదించిన సర్క్యూట్ రేఖాచిత్రం ఆధారంగా సిగ్నలింగ్-మోడిఫికేషన్ పనులు చేపట్టాలని ప్రతిపాదించాలని, ఈ కార్యకలాపాల్లో ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు.

ఏసీఎఫ్ సౌమ్యరంజన్ మృతి కేసులో మలుపు

- ముగ్గురు నిందితులకు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ



ఏసీఎఫ్ సౌమ్యరంజన్ మహాపాత్రో, భార్య విద్యాభారతి పండా(ఫైల్)

పర్లాకిమిడి: గజపతి జిల్లా అటవీ శాఖలో ఏసీఎఫ్‌గా విధులు నిర్వహిస్తూ అనుమానాస్పదంగా మృతిచెందిన సౌమ్యరంజన్ మహాపాత్రొ కేసులో ముగ్గురు ప్రధాన నిందితులకు పర్లాకిమిడి సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్(ఎస్‌డీజేఎం) కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. 2021 జూలై 11న తన క్వార్టర్స్‌లో కాలిన గాయాలతో ఏసీఎఫ్ మృతి చెందగా, ఆయన భార్య విద్యాభారతి పండా, ఇంటి వంటవాడు మన్మథ కుంభో, అప్పటి డీఎఫ్ఓ సంగ్రాం బెహరా నిందితులుగా ప్రాథమిక విచారణలో తేలింది. అయితే దర్యాప్తు అనంతరం స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం(ఎస్ఐటీ) వీరి ముగ్గురికీ క్లీన్‌చీట్ ఇచ్చారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన సౌమ్యరంజన్ తండ్రి అభిరాం బెహరా.. కేసును పునః విచారణ చేపట్టాల్సిందిగా పర్లాకిమిడి ఎస్‌డీజేఎం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం దర్యాప్తులో ముందుగా పేర్కొన్న ప్రధాన నిందితులకు నోటీసులు జారీ చేసింది. అయితే దీనిపై ముగ్గురూ స్పందించక పోవడంతో కోర్టులో విచారణకు రావాల్సిందిగా స్పష్టం చేసింది. అయితే హాజరు సైతం లేకపోవడంతో పలుమార్లు హెచ్చరించిన అనంతరం నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. మరోవైపు సౌమ్యరంజన్ భార్య విద్యాభారతి పశువైద్య శాఖలో లైవ్‌స్టాక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా, జూన్ 27నుంచి సెలవులో ఉన్నట్లు ఆశాఖ అధికారులు తెలిపారు. దీంతో ఏసీఎఫ్ మృతి కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది.

హత్య కేసులో నలుగురు అరెస్ట్



దర్యాప్తు జరుపుతున్న పోలీసులు



అరెస్టైన నిందితులు

జయపురం: బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధిలో చేతబడి చేశాడనే అనుమానంతో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ధనివలస గ్రామానికి చెందిన మహదేవ్ ఖొర(50)ని గ్రామస్తులు చేతబడి నెపంతో హత్య చేసిన విషయం తెలిసిందే. దీంతో మృతుని భార్య మంగుళి ఖొర ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు. అరెస్టైనవారు గ్రామానికి చెందిన ఆదు ఖొర, డొంబురు ఖొర, అర్జున్ ఖొర, మహాదేవ్ ఖొరలుగా తెలియజేశారు. హత్య జరిగిన రోజు నిందితులు పరారవ్వడంతో, పోలీసులు ముమ్మరంగా గాలించి పట్టుకున్నట్లు పోలీసు అధికారి అశ్వినీ కుమార్ పట్నాయిక్ తెలియజేశారు. నిందితులపై ఐపీసీ సెక్షన్ 302, 323, 341లు నమోదు చేసి, కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఆటో-ఆర్టీసీ ఢీ

- డ్రైవర్ సహా ఐదుగురికి గాయాలు



ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు

బరంపురం: గంజాం జిల్లా హింజిలికాట్ మార్గంలో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో బాధితులను దిగపండి ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. దీనిపై పోలీసులు, ప్రయాణికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో గంజాం జిల్లా హింజిలికాట్-పురుసోత్తంపూర్ మార్గం మీదుగా బరంపురం వైపు వస్తున్న ఒడిశా ఆర్టీసీ బస్సు.. ఎదురుగా వస్తున్న ఆటో పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సహా, అందులోని మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను దిగపపండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ఆటోలో చిక్కుకున్న వారిని బయటకు తీస్తున్న దృశ్యం

దివ్యాంగునికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



ఖోశ్లాకు ఆర్థికసాయం, ధ్రువపత్రం అందిస్తున్న పట్నాయక్

జయపురం: ఓ ప్రమాదంలో కాలు కోల్పోయిన వ్యక్తికి సీఎం రిలీఫ్ నిధి నుంచి ఆర్థిక సాయాన్ని జయపురం మున్సిపాలిటీ ఈఓ సిద్ధార్థ పట్నాయక్ మంగళవారం అందజేశారు. మున్సిపాలిటీలోని 8వ వార్డు డెప్పుగుడలో నివసిస్తున్న బాధితుడు ప్రదీప్‌కుమార్ ఖోశ్లా ఇంటికి వెళ్లిన ఆయన.. రూ.7,500లు అందజేశారు. జనవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖోశ్లా పాదం కోల్పోవడంతో ఇంటికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ దేవేంద్ర చౌధురి మున్సిపాలిటీ సహకారంతో ట్రై సైకిల్ సమకూర్చగా, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి పంపిణీ చేశారు. అలాగే కుటుంబ పోషణకు ఇబ్బందులు ఉండటంతో సీఎం సహాయ నిధి నుంచి సాయం కోరగా, ఈ మొత్తాన్ని అందజేశారు. అలాగే దివ్యాంగ ధ్రువపత్రం తోపాటు మధుబాబు పింఛన్ మంజూరు చేశారు. దీనితో పాటు ఈనెల 15న వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సౌకర్యం కల్పిస్తామని ఈఓ భరోసా ఇచ్చారు.

కడుపులో కణితి తొలగింపు

- విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన మల్కన్‌గిరి ప్రభుత్వ వైద్యులు



శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యుడు సోపన్‌కుమార్ బృందం



శుక్ర కడుపులో నుంచి తొలగతించిన కణితులు

మల్కన్‌గిరి: తీవ్రమైన నొప్పితో బాధపడుతున్న వ్యక్తి కడుపులో నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు రెండు భారీ కణితులను తొలగించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి చిమటాపల్లి గ్రామానికి చెందిన శుక్ర ముదిలి గత కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. రోజూ ఏదో ఒక మాత్ర వేస్తూ కాలక్షేపం చేస్తుండగా, ఆదివారం రాత్రి నొప్పి తీవ్రతరమైంది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు సోమవారం మల్కన్‌గిరి లోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకువెళ్లగా, పరీక్షించిన డాక్టర్ సోపన్‌కుమార్ దిండా కడుపులో రెండు భారీ కణితులు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం శస్త్రచికిత్స నిర్వహించి, వాటిని తొలగించారు ఇందులో ఒకటి 1100 గ్రాములు, మరొకటి 900గ్రాములు ఉన్నట్లు తెలిపారు. మరో 5రోజుల్లో రోగి పూర్తిగా కోలుకుంటాడని స్పష్టంచేశారు. విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన ప్రభుత్వ వైద్యులను కుటుంబ సభ్యులు అభినందించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు



మల్కన్‌గిరి ఆస్పత్రి వద్ద ముక్క మాడ్కమి మృతదేహం



చికిత్స పొందుతున్న భీమా కవాసి

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి టిట్‌బెరి గ్రామం వద్ద మంగళవారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. టిట్‌బెరి గ్రామానికి చెందిన ముక్క మాడ్కమి (32), అదే గ్రామానికి చెందిన భీమా కావసిలు ఒక బైక్ మీద మల్కన్‌గిరి వెళ్తున్నారు. అదే సమయంలో వారికి ఎదురుగా మల్కన్‌గిరి నుంచి సుకుమా మీదుగా ఆంధ్రా వెళ్లాలని సీహెచ్ సుభాష్, కె.సోమయాలు వేరే బైక్ మీద వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో నలుగురు కింద పడిపోయారు. స్థానికులు స్పందించి వెంటనే వారిని మలకన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో ముక్క మడ్కమి మృతి చెందాడు. మరో ముగ్గురిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. వారిలో సుభాష్, సోమయాలు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కొరాపుట్ తరలించారు. విషయం తెలిసిన మల్కన్‌గిరి పోలీసు ఐఐసీ రీగాన్‌కీండో తన సిబ్బందితో కలిసి ఆస్పత్రికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

శ్రామిక్ కాంగ్రెస్ అభినందన సభ

భువనేశ్వర్:

తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ఖుర్దా రోడ్ ప్రధాన కార్యాలయ శాఖ నూతన కార్యవర్గ సభ్యుల అభినందన సభ మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా నియమితులైన జి.రామ్మోహనరావు, కేంద్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్‌కుమార్ సహాణిని సత్కరించారు. ప్రధాన కార్యాలయ శాఖ అధ్యక్షుడు శరత్‌కుమార్ పండా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిబ్బంది, కార్మికుల సంక్షేమానికి నిరంతర కృషే లక్ష్యంగా కార్యవర్గాన్ని ఎన్నికున్నట్లు కార్యదర్శి లక్ష్మీధర మహంతి తెలిపారు.



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

స్మార్ట్‌కెం సమీపంలో మంటలు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలోని స్మార్ట్ కెం పరిశ్రమ సమీపంలో మంగళవారం మంటలు ఎగిసి పడ్డాయి. పొదలకు మంటలు విస్తరించటంతో పరిశ్రమ ఉద్యోగి రాజేష్ శ్రీకాకుళం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వాహనంతో సకాలంలో చేరుకొని పొదలకు అంటుకున్న మంటలు అదుపు చేశారు. అయితే మంటలు సంభవించడానికి కారణం తెలియరాలేదు.

తెలగ కులస్తులను బీసీల్లో చేర్పించాలి



లావేరులో రంగా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న తెలగ సంఘం జిల్లా, మండల నాయకులు.

లావేరు: తెలగ కులస్తులను బీసీల్లో చేర్పించాలని, తెలగ కులస్తులకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలని జిల్లా తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రొక్కం సూర్యప్రకాష్, ఉత్తరాంధ్ర తెలగ సంఘం నాయకుడు పల్లంట్ల వెంకటరామారావు అన్నారు. మండలంలోని లావేరు గ్రామంలో మంగళవారం ఉత్తరాంధ్ర తెలగ సంఘం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా లావేరులో వంగవీటి మోహనరంగా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో 8 లక్షల మంది తెలగ కులస్తులు ఉన్నారని, అయినా చట్టసభల్లో అవకాశం లేదన్నారు. తమ వర్గం వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. తెలగ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య



భర్త మృతదేహానికి తలకొరివి పెడుతున్న భార్య రోహిణి

హిరమండలం: భర్తకు భార్య తలకొరివి పెట్టిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మేజర్ పంచాయతీ హిరమండలం చిన్నకోరాడకు చెందిన నగరపు శంకరరావు (40) కడుపు నొప్పి తాళలేక ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం స్వగ్రామానికి మృతదేహాన్ని తరలించగా అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ముందుకు రాలేదు. కుమారులు కూడా లేరు. ఇద్దరు కుమార్తెలు ఉన్నప్పటికీ వీలు చిక్కలేదు. దీంతో భార్య రోహిణి భర్త మృతదేహానికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసి రుణం తీర్చుకుంది.

మెడికో అంత్యక్రియలు పూర్తి



చైతన్య అంత్యక్రియలకు హాజరైన జనం

కాశీబుగ్గ: నెల్లూరులో ఆత్మహత్య చేసుకున్న వైద్య విద్యార్థిని చైతన్య అంత్యక్రియలు మంగళవారం ఉదయం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 06వ వార్డు పెసరపాడులో జరిగాయి. ఆమె మృతదేహాన్ని చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు అధికంగా వచ్చారు. గ్రామ సమీపంలో ఉన్న శ్మశానంలో అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు చేశారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఐఏఎల్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కూన అన్నం నాయుడు కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కోర్టు ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు, సంక్షేమ నిధి మొత్తాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ప్రతినిధులు జి.చంద్రమౌళి, గంగు భాస్కరరావు ఉన్నారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు వెల్లడి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు మంగళవారం విడుదల చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. పరీక్షకు 8130 మంది హాజరు కాగా, 3195 మంది(39.30 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బీఎస్సీలో 5397 కి 1971 మంది, బీకాంలో 1416 కి 621, బీఏలో 975 కి 410, బీబీఏలో 132 మందికి 84, బీసీఏలో 210కి 109 మంది ఉత్తీర్ణత సాధించారు. జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంచారు. 15 రోజుల్లోగా విద్యార్థులకు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.



రాయగడ: మెయిన్ రోడ్డులో వర్షం కురుస్తున్న దృశ్యం

వానందం

రాష్ట్రంలోని రాయగడ, పర్లాకిమిడి ప్రాంతాల్లో మంగళవారం వర్షం కురిసింది. దీంతో ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఎండ నుంచి ఉపశమనం లభించింది. కొన్నిచోట్ల కుంభవృష్టి కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. రాయగడలో సుమారు 9.3మి.మి వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

– సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: పర్లాకిమిడిలో జోరుగా కురుస్తున్న వర్షం

గాంధేయ ఉద్యమం!

- ఇంజినీర్‌కు 'లంచం'గా కూరగాయలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకుడు



ఇంజినీర్‌కు కూరగాయలు అందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు

భువనేశ్వర్: అవినీతిపై నిరసనగా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కటక్ నగరంలోని ఓ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం కోసం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు కూరగాయలను లంచంగా ఇవ్వడానికి వెళ్లాడు. కాంగ్రెస్ నాయకుడితో వెళ్లిన గ్రామస్తుడు ప్యాంట్, చొక్కా తీసి ఇంజినీర్ టేబుల్‌పై పెట్టాడు. తాను పేద రైతునని, డబ్బులు ఇవ్వలేనందున లంచంగా తన దుస్తులు తీసుకోవాలని కోరాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ కటక్ జిల్లాశాఖ అధ్యక్షుడు మానస్ చౌదరి, పార్టీ కార్యకర్తలతో కలిసి కూరగాయలతో ప్రాచీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రతాప్‌చంద్ర చౌదరి కార్యాలయ ఛాంబర్‌కు వెళ్లి కూరగాయలను ఆయన డెస్క్‌పై ఉంచారు. రోడ్డు పనులకు సంబంధించి కూరగాయలను వాటాగా అంగీకరించాలని సూచించారు. రాష్ట్రంలో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వ్యంగ్యంగా విమర్శించారు. ఈ సందర్భంగా మానస్ చౌదరి విలేకర్లతో మాట్లాడుతూ.. నగర శివారులోని 50 పేద కుటుంబాలు నివసిస్తున్న ఖొండాయిత్ గ్రామానికి రహదారి నిర్మించాలని ప్రభుత్వానికి నివేదించగా, మంజూరైందన్నారు. అయితే పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, 400 మీటర్ల రోడ్డు నేటికీ పూర్తి కాలేదని విచారం వ్యక్తం చేశారు. దీనిపై ఈఈ ప్రతాప్‌చంద్రను వివరణ కోరగా.. పరిస్థితి పట్ల తనకు అవగాహన లేదని తెలిపారు. నాయకుల అభ్యర్థన మేరకు తన దృష్టికి వచ్చిన సమస్యను వారం లోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

జయపురం: విష సర్పం కాటు వేయడంతో ఆస్పత్రిలో చేరిన వృద్ధుడు.. చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బొయిపరిగుడ సమితిలో చోటుచేసుకుంది. దీనిపై కుటుంబ సభ్యులు, ఆస్పత్రి వర్గాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొయిపరిగుడ సమితి ఖొంగరపర గ్రామానికి చెందిన నాథ్ గదబ(63) వ్యవసాయ పనుల నిమిత్తం సోమవారం గండిమగుడకు వెళ్లాడు. అక్కడే ఉన్న గుడిసెలో తన సోదరుడితో కలిసి రాత్రి నిద్రించాడు. వేకువజాము సమయంలో తీవ్రవైన నొప్పితో హాహాకారాలు చేయడంతో పాము కాటు వేసినట్లు గుర్తించిన సోదరుడు చుట్టుపక్కల ఉన్న మిగతా రైతులను పిలిచాడు. వారి సాయంతో బొయిపరిగుడ కమ్యూనిటీ ఆసత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు. బొయిపరిగుడ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.



నాథ్ గదబను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రణస్థలంలో దొంగలు పడ్డారు

- 130 తులాల వెండి, 3.5 తులాల బంగారం అపహరణ
- సెల్‌ఫోన్లు, టీవీ, ఇన్వర్టర్లను సైతం తీసుకెళ్లిన చోరులు



చోరీ జరిగిన సెల్ దుకాణం

రణస్థలం: రణస్థలం మండలంలో పలు చోట్ల దొంగతనాలు జరిగాయి. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న కొప్పిశెట్టి లక్ష్మణ ఇంట్లో వంద తులాల వెండిని సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. ఇంట్లో వేర్వేరు గదుల్లో అందరూ పడుకోగా..లోనికి చొరబడిన దొంగలు దేవుడు గదిలో ఉన్న వెండిని అపహరించుకుని పోయినట్లు మంగళవారం ఉదయం లక్ష్మణ గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో శ్రీకాకుళం నుంచి వచ్చిన క్లూస్ టీం వివరాలు సేకరించారు. అలాగే సోమవారం రాత్రి కోష్ట గ్రామంలోని పద్మ సెల్ దుకాణంలో కూడా చోరీ జరిగింది. దుకాణం యజమాని సూరాడ అప్పన్న తెలిపిన వివరాల ప్రకారం.. సెల్ దుకాణంపై సిమెంట్ రేకులు పగులకొట్టి 15 సెల్‌ఫోన్లు, ఎల్‌సీడీ టీవీ, ఇన్వర్టర్‌ను దొంగలు పట్టుకెళ్లిపోయారు. ఈ రెండు దొంగతనాలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు. అలాగే గత నెల 28వ తేదీన మండల కేంద్రంలోని కాపు వీధిలో ఉంటున్న కరిమజ్జి రామప్పడు ఇంట్లో 3.5 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. 16 వేలు నగదు, రూ. రెండు లక్షల విలువైన బాండ్లు పోయినట్లు జె.ఆర్.పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రయాన్-3 ప్రత్యక్ష వీక్షణకు ప్రత్యేక బస్సు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా నుంచి తొలిసారిగా నెల్లూరులోని శ్రీహరికోటలో గల సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో 'చంద్రయాన్ -3' రాకెట్ లాంచింగ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తోందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ అధికారులు నెల్లూరులోని శ్రీహరికోటలో గల అధికారులతో సమన్వయం చేసుకొని ప్రత్యేక అనుమతి తీసుకున్నారని చెప్పారు. తద్వారా చంద్రయాన్-3ని డిగ్రీ చదివే విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం లభిస్తోందన్నారు. సైన్స్ విద్యార్థులకు ఇదో చక్కటి అవకాశమని తెలిపారు. ఈ అవకాశాన్ని డిగ్రీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ఈనెల 12వ తేదీన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సూపర్‌లగ్జరీ బస్సు మధ్యాహ్నం 2గంటలకు బయల్దేరుతుందన్నారు.

సైన్స్ ప్రదర్శనలకు వేళాయె..

- 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నామినేషన్ల స్వీకరణ

ఇన్‌స్పైర్ మనాక్ లోగో



శ్రీకాకుళం హయాతీనగరంలోని జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ ఆశ్రమ పాఠశాలలో ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు(ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల్లో విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు వేళయింది. 2023-24 విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఇన్‌స్పైర్ మనాక్ పేరిట ప్రాజెక్టుల నమూనాలు ప్రదర్శించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నామినేషన్ల ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్‌స్కూళ్లు, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు తమ నామినేషన్లు చేసుకునేందుకు అర్హులు. సైన్స్ ప్రాజెక్టుల నమూనా ప్రదర్శనలకు ఈ పాఠశాలల విద్యార్థులకు అవకాశం ఉంటుంది.

ఆన్‌లైన్‌లో నామినేషన్ల ప్రక్రియ..

ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో నామినేషన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాలలు ఐదు, ప్రాథమికోన్నత పాఠశాలలు రెండు లేదా మూడు చొప్పున ప్రాజెక్టులకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో ప్రాజెక్టు నామినేషన్ల ప్రక్రియను పూర్తిచేయాలి. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలలు 410 ఉండగా వీటిల్లో 1,08,242 మంది చదువుతున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు 304 ఉండగా వీటిల్లో 28210 మంది చదువుతున్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టుల వివరాలు నమోదు చేసుకోవడానికి అర్హులు.

ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి: డీఈవో

సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు నామినేషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసేలా ఆయా యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య కోరారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్.డీఎస్‌జీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో ప్రాజెక్టుల వివరాలను తెలుసుకోవడంతోపాటు నామినేషన్ల పూర్తిచేయాలన్నారు. అలాగే బ్యాంకు అకౌంట్ నంబర్లను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఎస్.కుమారస్వామి (సెల్: 9490037182, 8074332929)ని సంప్రదించాలన్నారు.

కాసీపూర్‌లో ఓఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ పర్యటన



ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఓఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ మహంతి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితిలో ఒడిశా ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్(ఓఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ అశోక్‌కుమార్ మహంతి మంగళవారం పర్యటించారు. సమితిలోని మర్రిభట్ట, ఖురిగాం, ద్విముండి, డి.కొరల్, కలియాపొడ, డి.ముఖ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. ఆదివాసీ, హరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం ఓస్ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామానికి రూ.40 లక్షల చెప్పున్న మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో రహదారులు, సోలార్ లైట్లు తదితర వసతులు కల్పించాలని సూచించారు. అలాగే ఇప్పటికే పనులు చేపట్టిన ప్రాంతాల్లో వాటి ప్రయోజనాలపై ఆరా తీశారు. అనంతరం తుటిబార్ గ్రామంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్‌ను బంగారు బాటలో నడిపించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. శ్రద్ధగా చదువుకుని, ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆకాంక్షించారు. పర్యటనలో కాసీపూర్ సంక్షేమశాఖ అధికారి అక్షయకుమార్ సాహు, గిరిజా దాస్, సంవిత్ శ్యామ్, సీనియర్ పాత్రికేయులు సుబ్రత్ ఛౌదరి తదితరులు పాల్గొన్నారు.



మర్రిభొట్ట గ్రామంలో సోలార్ లైట్లను పరిశీలిస్తున్న దృశ్యం

వేధింపులు తాళలేక ట్రాక్‌మెన్ ఆత్మహత్య

- తాడేపల్లిలో ఘటన, మృతుడు పోలాకి వాసి



హేమసుందర్ (ఫైల్)

పోలాకి: రైల్వే అధికారుల వేధింపులకు ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. కుటుంబసభ్యులు తెలిపిన వివిరాల ప్రకారం.. పోలాకి మండల కేంద్రానికి చెందిన టంకాల హేమసుందరరావు (32) ఇండియన్ రైల్వేలో 2013 నుంచి ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తాడేపల్లిలో తాను నివాసం ఉంటున్న క్వార్టర్స్‌లో ఆదివారం వేకువజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తోటి సిబ్బంది గుర్తించారు. విషయం తెలుసుకున్న హేమసుందర్ కుటుంబసభ్యులు అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల వేధింపులకు తమ కుమారుడు చనిపోయాడని మృతుడి తండ్రి రాజులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. హేమసుందర్‌కు భార్య లక్ష్మి, తొమ్మిది నెలల కుమారుడు సిద్ధార్థరామ్ ఉన్నారు. హేమసుందర్ మృతదేహాన్ని బుధవారం స్వగ్రామం తీసుకురానున్నారు.

అప్పులు తీర్చలేమనే భయంతో మహిళ బలవన్మరణం

శ్రీకాకుళం క్రైమ్: చేసిన అప్పులు తీర్చలేమనే భయంతో వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడినట్టు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. బలగ మెట్టు శివాలయం గుడి దగ్గర బుంగ అన్నపూర్ణమ్మ (50) కొబ్బరికాయలు, అరటి పండ్లు, పువ్వులు విక్రయిస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈమెకు భర్త నాగేశ్వరరావు, నలుగురు కుమాలు ఉన్నారు. వీరిలో ముగ్గురు కుమారులకు వివాహమైంది. అందరూ ఉమ్మడిగా కలిసి ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. తమకు తెలిసిన వారి వద్ద రూ. 3 లక్షలు అప్పుగా తెచ్చి కుమారుల చేత రెండేళ్ల క్రితం ఇటుకల బట్టీని బలగ నాగేశ్వరి ఘాట్ (నాగావళి నది) వద్ద అన్నపూర్ణమ్మ పెట్టించింది. కొన్నాళ్లు బాగా నడిచినా ఆ తర్వాత సరిగా లాభాలు రాక ఆపేశారు. దీంతో పెద్ద కుమారుడు హెరిటేజ్‌లో బాయ్‌గా, మరో ఇద్దరు కుమారులు ఎయిర్‌టెల్, ఫైబర్‌లో పనిచేస్తున్నారు. వీరంతా పనిచేసి తెచ్చిన సొమ్ము ఇంటి ఖర్చులకే సరిపోతున్నాయి. దీనికితోడు భర్త నాగేశ్వరరావు మద్యం తాగి గొడవ చేస్తుండేవాడు. దీంతో మనస్తాపం చెందిన అన్నపూర్ణ ఈ నెల మూడో తేదీ ఉదయం 11.30 గంటల సమయంలో ఇంట్లో ఉన్న వాస్‌మాల్ -33 ఆయిల్ తాగి అపస్మారక స్థితిలో ఇంటి దిగువున స్టోర్‌రూమ్‌లో పడిపోయింది. పెద్ద కోడలు నాగేశ్వరి చూసి కుటుంబ సభ్యులకు చెప్పడంతో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి అన్నపూర్ణమ్మ మరణించినట్లు సీఐ చెప్పారు. పెద్ద కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.



అన్నపూర్ణమ్మ మృతదేహం

యువకుడు మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: టెక్కలి కంచ్రవీధికి చెందిన యువకుడు నాగుల ధర్మ (31) చేపలు విక్రయించడానికి వెళ్లి వస్తూ చనిపోయినట్టు పోలీసులు తెలిపారు. ముఖలింగాపురం పంచాయతీ పరిధి చిరుతునాపల్లి గ్రామంలోని పంట పొలాల్లో మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించినట్టు చెప్పారు. ఇద్దరు స్నేహితులతో కలిసి ధర్మ కొల్లివలస గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టి విక్రయించేందుకు సమీప గ్రామాల్లోకి సోమవారం వెళ్లారు. ఇందులో భాగంగానే చిరుతునాపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ సమీప పొలాల్లో ధర్మ అస్వస్థతకు గురై పడిపోయాడు. అతని వెంట ఉన్న స్నేహితులు మద్యం మత్తులో పడిపోయి ఉంటాడని.. మెలకువ వచ్చిన తరువాత ఇంటికి వస్తాడని భావించి వదిలేసి వచ్చేశారు. అయితే మంగళవారం అటుగా వెళ్లిన స్థానికులు శవమై ఉన్న ధర్మను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. ధర్మ వెంట వెళ్లిన వారిని విచారించి వివరాలు సేకరించారు. మృతిని అన్నయ్య సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బాలుడికి భారీ ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామం జగపూర్‌కు చెందిన దున్న లోహిత్ అనే బాలుడు కొంతకాలంగా తలసేమియా వ్యాధితో బాధ పడుతున్నాడు. బాలుడి తండ్రి ధర్మారావు ఇటీవల టర్కీకు ఉపాధి కోసం వెళ్లారు. అక్కడ తన తోటి కూలీలకు గోడు చెప్పుకున్నారు. దీంతో వారంతా కలిసి మంగళవారం బాలుడి వైద్యం కోసం ఏకంగా రూ.14,32,500 నగదును అందజేశారు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడికు నగదు అందజేస్తున్న దాతలు

క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



మద్యం తరలిస్తున్న వ్యక్తితో పోలీసులు

గంట్యాడ: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన బోదంకి కనక సత్యం మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ క్రమంలో మాటు వేసిన పోలీసులు..కొఠారుబిల్లి జంక్షన్ నుంచి గ్రామానికి మద్యం సీసాలు తరలిస్తుండగా బోదంకి కనకసత్యాన్ని అదుపులోకి తీసుకుని 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



ఘటనా స్థలంలో పైడిరాజు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటలో విద్యుత్ షాక్ తగిలి ఓ రైతు మృతి చెందాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన పైడిరాజు(45) ఉదయం 9 గంటల సమయంలో తన పాడి ఆవుకోసం పచ్చగడ్డి కోయడానికి పొలంలోకి వెళ్లాడు.అయితే సోమవారం సాయంత్రం వీచిన గాలి, వర్షానికి హెవీ లైన్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లు తెగి పడిన విషయం గమనించక పోవడంతో ప్రమాదవశాత్తు వైర్లు తగిలి షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

412కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత

గజపతినగరం: స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో ద్విచక్రవాహనాలపై అక్రమంగా తరలిస్తున్న 412 కేజీల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై గంగరాజు మంగళవారం రాత్రి తెలిపారు. మూడు ద్విచక్రవాహనాలపై తరలిస్తున్న పొట్నూరు అప్పలనాయుడు, ఇంకుల సన్యాసిరావు, ముప్పిడి గణేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పట్టుబడిన బియ్యాన్ని సీఎస్ డీటీ రవిశంకర్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి పీలుస్తున్న నలుగురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: స్థానిక సీఎంఆర్ సమీపంలో గంజాయి పీలుస్తున్న నలుగురు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిషేధిత గంజాయిని వినియోగిస్తుండగా పట్టుకుని ఎస్సై గోపాల్ అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ టీటీడీ సేవా టికెట్లు ఇచ్చి మోసం

ఆన్‌లైన్ ద్వారా పరిచయమైన వ్యక్తి టీటీడీలో సేవా టికెట్లు ఇస్తానని చెప్పడంతో నమ్మి కుటుంబ సభ్యులందరికీ సేవా టికెట్లను కొనుగోలు చేసిన ఓ వ్యక్తి మోసపోయాడు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక కాంబోవీధికి చెందిన దాడి భాస్కరరావు తిరుమలేశుని దర్శనం చేసుకునేందుకు గాను ఆన్‌లైన్‌లో వస్త్ర, అభిషేక తదితర టికెట్లను కొనుగోలుచేసేందుకు సిద్ధమయ్యాడు. అది గమనించిన రమణప్రసాద్ అనే వ్యక్తి తాను తిరుమలలో పనిచేస్తున్నట్లు చెప్పి, నమ్మించి రూ.లక్షా 84వేల 500తో మొత్తం కుటుంబసభ్యులందరికీ సేవా టికెట్లు బుక్ చేయించి పంపించాడు. అయితే భాస్కరరావుకు అనుమానం వచ్చి తెలిసిన వ్యక్తులు తిరుపతి వెళ్తే వారి ద్వారా ఆ టికెట్లను తిరుమల పంపించారు. అక్కడ అవి నకిలీవి అని తేలడంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం, ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు.



స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడిలో కొలువైన పైడితల్లి అమ్మవారికి లడ్డూలతో నివేదన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్ శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో పైడితల్లి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు.

స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి మార్గదర్శి

- భావితరాలకు వీరుల చరిత్ర బోధించాలి
- జేసీ మయూర్ అశోక్



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ తదితరులు

విజయనగరం అర్బన్: భారత స్వాతంత్య్ర పోరాటానికి అల్లూరి సీతారామరాజు మార్గదర్శిగా నిలిచారని సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. అతి పిన్న వయసులోనే దేశం కోసం త్యాగం చేసి స్వాతంత్య్ర స్ఫూర్తిని రగిల్చిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అలాంటి వీరుల గాథలను భావితరాలకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి జేసీ, డీఆర్‌ఓ, ఇతల అధికారులు నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభలో జేసీ మాట్లాడుతూ అల్లూరిలోని నాయకత్వ లక్షణాలను, త్యాగస్ఫూర్తి, దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వచ్చే 25 ఏళ్లలో దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చూడాలని ఆకాంక్షించారు. డీఆర్‌ఓ గణపతిరావు మాట్లాడుతూ ఏమీ ఆశించకుండా దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీరుడు అల్లూరి అని కొనియాడారు. యువత నిస్వార్థంగా ఆలోచించి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మెప్మా పీడీ సుధాకర్ మాట్లాడుతూ అల్లూరి దేశ భక్తిని వివరించారు. సమావేశంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి అల్లూరి

విజయనగరం గంటస్తంభం: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా, జిల్లా పరిషత్ చైర్మన్, విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లదొరల దురాగతాలకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగసిపడ్డ ఉద్యమ కెరటం అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. భారత స్వాతంత్య్రం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్య్రం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుని చరిత్ర రాబోయే తరం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, ఇతర అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతపై దృష్టి అవసరం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

- నాడు నేడు పనులు నెలాఖరుకు పూర్తికావాలి
- రెండురోజుల్లో సర్వే ముగించాలి
- అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి సమీక్ష

విజయనగరం అర్బన్: జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని పాఠశాలల్లో నాడు నేడు పనులు జరుగుతున్న కారణంగా విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టి, ప్రమాదాల నివారణకు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆదేశించారు. భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని పాఠశాలల్లో సెప్టిక్ ట్యాంకు, సంప్ ట్యాంకు, పునాదుల కోసం తవ్విన గోతులు, ఐరన్ రాడ్లు తదితర నిర్మాణ సామగ్రి, మేడమెట్లు, పై అంతస్తు నిర్మాణం తదితర చోట్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, అటువంటి చోట రక్షణచర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు నేడు పనులపై కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. తరగతి గదుల మరమ్మతులు, కిచెన్ షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు వేగంగా జరగకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులకు కొరత లేదని, జిల్లాలోని పాఠశాలల వద్ద ఇప్పటికే సుమారు రూ.10 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయని, వాటిని త్వరగా ఖర్చుచేసి, పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే సిమెంట్, ఇసుక తదితర నిర్మాణ సామగ్రికి కూడా ఇబ్బంది లేదని, శానిటరీ పరికరాలను స్థానికంగానే కొనుగోలు చేసుకునే వెసులుబాటు కూడా ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. అన్నీ అందుబాటులోనే ఉన్నప్పటికీ నిర్మాణ పనులు వేగంగా జరగడం లేదన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణంపై వెంటనే స్టేజ్ అప్‌డేషన్ చేయాలని శుక్రవారం నాటికి బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఒక్క బిల్లు కూడా పెండింగ్ ఉండకూడదని ఆదేశించారు. మంజూరైన ప్రతి చోటా పని ప్రారంభం కావాల్సిందేని స్పష్టంచేశారు.

నెలాఖరుకు అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు

అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల ప్రాంగణంలో 110 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, మరమ్మతుల స్థితిగతులను మండలాల వారీగా తెలుసుకున్నారు. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి, అవసరమైన పనులకు ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో పంపించాలని సూచించారు. పాఠశాలలకు స్మార్ట్ టీవీలు వచ్చిన వెంటనే బిగించాలని, ఇప్పటికే షెడ్యూల్ కూడా జారీ అయిందని తెలిపారు. అధికారులు సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేసి నాడు నేడు పనులను పరుగు పెట్టించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, డీవీఈఓ ఆర్.సురేష్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ఎంఈఓలు, మండల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



హాజరైన జిల్లా అధికారులు

పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు
- కొత్తవలస బీసీ బాలికల హాస్టల్ పరిశీలన
- వేరే చోటికి తరలించేందుకు నిర్ణయం



హాస్టల్ వార్డెన్ నీరజాకుమారిని విచారణ చేస్తున్న కేసలి అప్పారావు



వార్డెన్‌ను విచారణ చేస్తున్న జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి యశోధనరావు

కొత్తవలస: వసతి గృహాల్లో ఉన్న పిల్లల పట్ల వార్డెన్, సిబ్బంది అత్యంత బాధ్యతగా వ్యవహరించి తల్లిదండ్రుల మాదిరిగా విద్యార్థులను సాకాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గల బీసీ బాలికల వసతి గ్రహంలో విద్యార్థినులను వార్డెన్ నీరజాకుమారి వేధింపులకు గురిచేస్తోందని సాక్షి దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన ‘విద్యార్థినుల విలవిల’ వార్తకు ఆయన స్పందిస్తూ మంగళవారం హాస్టల్‌ను సందర్శించి వార్డెన్‌ను విచారణ చేశారు. హాస్టల్ గదులను పరిశీలించి విద్యార్థినులతో మమేకమై పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల పట్ల తల్లిదండ్రుల కంటే ఎక్కువ బాధ్యతగా వ్యవహరించాలని వార్డెన్, సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం హాస్టల్‌కు హైస్కూల్‌కు మధ్య చాలా దూరం ఉందని హాస్టల్‌ను హైస్కూల్‌కు దగ్గరగా పోలీస్‌స్టేషన్ సమీపంలో గల ఎస్సీ బాలుర వసతి గృహంలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాగా ఫిబ్రవరి నెలలో ఇదే హాస్టల్‌లో జరిగిన ఒక పరిణామంతో అప్పటి కలెక్టర్ ఎ.సూర్యకుమారి హాస్టల్‌ను సందర్శించి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి హాస్టల్‌ను పోలీస్‌స్టేషన్ సమీపంలో గల ఎస్సీ హాస్టల్‌లోకి మార్చాలని ఆదేశించారు.అయితే అనివార్య కారణాల వల్ల ఆ ప్రక్రియ జరగలేదు. ప్రస్తుతం బాలికల హాస్టల్ విద్యార్థినులు హైస్కూల్‌కు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారని దగ్గరగా గల ఎస్సీ హాస్టల్‌లోకి మార్చేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తామని చెప్పారు.

మధ్యాహ్న భోజనంపై సంతృప్తి

అనంతరం స్థానిక హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తయారీ, వంటల రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ 10వ తరగతి అత్యంత కీలకమైనదని సంస్కారవంతమైన, విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని చెడు స్నేహాలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమఅధికారి ఎం.యశోదనరావు, ఎంఈఓ-2 బందారు శ్రీనివాసరావు,హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో బీసీ హాస్టల్ మార్పు

కొత్తవలస మండల కేంద్రంలోని కోటపాడు రోడ్డులో గల బీసీ బాలికల వసతి గృహాన్ని వారం రోజుల్లోగా పోలీస్‌స్టేషన్ సమీపంలో గల ఎస్సీ హాస్టల్‌లోకి మారుస్తామని వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమ అధికారి ఎం.యశోధనరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన హాస్టల్‌ను సందర్శించి వార్డెన్‌ను విచారణ చేశారు. విద్యార్థులను వేరు వేరుగా కలిసి ప్రశ్నించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వార్డెన్‌పై వచ్చిన అభియోగాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

డెంగీపై అవగాహన కలిగి ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

పార్వతీపురంటౌన్: డెంగీ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మలేరియా, ఫైలేరియా శాఖల ఉప సంచాలకుడు టి.రామనాథం అన్నారు. ఈ నెల1వ తేదీ నుంచి 31 వరకు జరిగే జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని పార్వతీపురం పురపాలక శాఖ సంఘం కార్యాలయం వద్ద మంగళవారం ప్రారంభించి నాలుగు రోడ్ల కూడలి వరకూ డెంగీ వ్యాధిపై స్లోగన్స్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ చాలా ప్రాణాపాయంతో కూడుకున్న వెక్టర్ వల్ల సంక్రమించే వ్యాధిఅని తెలిపారు. ఈ వైరస్ వెస్ట్‌నైల్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తుందని, జ్వరానికి సంబంధించినదని, డెంగీ వైరస్ ఏడిస్ దోమ కుట్టడం ద్వారా వ్యాపిస్తుందని వివరించారు. డెంగీ ఫీవర్ వచ్చిన ఆరు రోజుల తర్వాత దాని లక్షణాలు కనిపిస్తాయన్నారు. తీవ్రమైన తలనొప్పి, కీళ్ల నొప్పి, కండరాల నొప్పి, వికారం, అలసిపోవడం, జ్వరం, వాంతులు 5 రోజుల తరువాత చర్మంపై దద్దుర్లు కలుగుతాయని పేర్కొన్నారు. డెంగీ వ్యాధి రాకుండా ఉండాలంటే ఇంటి చుట్టుపక్కల ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఇంట్లో ఉన్న ట్యాంక్, బారెల్, డ్రమ్ముల్లో నీరు తప్పనిసరిగా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏడిస్ దోమలు పగటి పూట కూడతాయని, కాబట్టి పిల్లలు, వృద్ధులు, మధ్యాహ్నం విశ్రాంతి తీసుకునే మహిళలు దోమతెరలు ఉపయోగించాలని సూచించారు. డెంగీ సోకిన వారు వెంటనే ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జి.వెంకటరమణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు, డీఎల్‌ఓ శ్యామ్‌కుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి డి.సత్యనారాయణ పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆపద్బంధువు గురుదేవా



కృత్రిమ అవయవాల తయారీ యూనిట్‌లో తయారీ విధానాన్ని వివరిస్తున్న ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు

- సూపరింటెండెంట్ ఆఫ్ జైలర్ సెంట్రల్ ప్రిజన్

కొత్తవలస: దివ్యాంగుల పాలిట ఆపద్బంధువుగా గురుదేవా చారిటబుల్ ట్రస్టు నిలుస్తోందని సూపరింటెండెంట్ ఆఫ్ జైలర్(సెంట్రల్ ప్రిజన్) ఎస్.కిశోర్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టును ఆయన తిరుమల హాస్పిటల్స్ ఎం.డి, విజయగనరం రోటరీ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణకాంతితో కలిసి మంగళవారం సందర్శించారు. ముందుగా దివ్యాంగులకు అందించే కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం, ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు జీవితం అంకితం చేశారని ప్రశంసించారు. దివ్యాంగులకు ట్రస్టు అందిస్తున్న సేవ వెలకట్టలేనిదన్నారు. అనంతరం 50 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, చెవిటి మిషన్‌లు, బ్లైండ్ స్టిక్స్, చంక కర్రలు,వాకర్స్ వీల్‌చైర్స్ అందించారు.అలాగే వంద మంది వృద్ధులకు రేషన్, పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు షాపుల్లో విక్రయాలు నిలుపుదల

- సోర్స్ సర్టిఫికెట్ లేనందున చర్యలు
- నకిలీలు విక్రయిస్తే చర్యలు
- బొబ్బిలి ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్



శ్రీదేవి ఆగ్రో ఏజెన్సీస్ షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ ఎం.శ్యామ్ సుందర్

గజపతినగరం: సోర్స్ (విత్తనధ్రువీకరణ పత్రం) సర్టిఫికెట్ లేకుండా విత్తనాలు విక్రయిస్తున్న రెండు షాపుల్లో అమ్మకాలు తక్షణమే నిలుపుదల చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌స్పెక్షన్ అధికారి, బొబ్బిలి ఏడీఏ ఎం.శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం గజపతినగరం మండల కేంద్రంలో గల శ్రీదేవి ఆగ్రో, శ్రీనివాస ఆగ్రో, మన గ్రోమోర్, శ్రీసత్య సాయి ట్రేడర్స్ తదితర షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను, విత్తనాలు,పురుగు మందులను పరిశీలించి మొలక శాతం కట్టే విత్తనాలను రైతులకు సరఫరా చేయాలని, నాశిరకం విత్తనాలు, పురుగు మందులను అమ్మజూపిన వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.తనిఖీల్లో భాగంగా శ్రీదేవి ఆగ్రో కెమికల్స్‌లో వంగ విత్తనాలకు సంబంధించి, సాయిశ్రీనివాస్ ఆగ్రో ఏజెన్సీస్‌లో మొక్కజొన్న విత్తనాలకు సంబంధించి సోర్స్ సర్టిఫికెట్‌లు లేనందున ఆరెండు షాపుల యజమానులకు నోటీసులు ఇచ్చి అమ్మకాలు నిలిపివేశారు. కార్యక్రమంలో స్థానిక మండలవ్యవసాయ శాఖ అధికారిణి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భర్త చెంతకు భార్యా పిల్లలు



పోలీస్‌స్టేషన్‌లో భార్యా పిల్లలను రాంబాబుకు అప్పగిస్తున్న ఎస్సై

రాజాం సిటీ: తన భార్య ఇద్దరు పిల్లలు, ఈ నెల 1న అదృశ్యమయ్యారని భర్త పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసులో 24 గంటల్లోనే తల్లీపిల్లలను వెతికి అప్పగించారు. దీనికి సంబంధించిన ఎస్సై పి.నీలావతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంతకవిటి మండలం బొద్దూరు గ్రామానికి చెందిన రాంబాబు భార్య అరుణకుమారి, కుమార్తె ద్రాక్షాయిని, కుమారుడు తేజేశ్వరరావులతో స్థానిక బాబానగర్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే ప్రతిరోజూ మద్యం తాగి భార్యను కొట్టడంతో విసుగుచెందిన ఆమె ఎక్కడైనా దూరంగా బతుకుదామని అనుకుంది. ఈ నెల 1న కుమార్తెను కళాశాలకు, కుమారుడిని పాఠశాలకు తీసుకువెళ్తానని చెప్పి ఎక్కడికో వెళ్లిపోయింది. ఆమె దూరపు బంధువులను ఫోన్‌ల ద్వారా సంప్రదించి విశాఖపట్నంలోని గాజువాకలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అక్కడినుంచి పిల్లలతోపాటు ఆమెను తీసుకువచ్చి భార్యాభర్తలకు కౌన్సెలింగ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

డెంకాడ: జిల్లా నెహ్రూ యువ కేంద్రం యువ ఉత్సవ్ 2023ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభను కనబరిచారు. రాష్ట్ర స్థాయి అర్హత నిమిత్తం డిక్లమేషన్, యంగ్ ఆర్టిస్ట్, యంగ్ రైటర్, ఫొటోగ్రఫీ తదితర విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. దీనిలో యంగ్ రైటర్ విభాగంలో ఎల్లపు కావ్య, ఫొటోగ్రఫీ విభాగంలో బి.శివ ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ పి.సీతారామరాజు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, స్టూడెంట్ డీన్ ఎస్.మోహన్‌కుమార్, ఐక్యూఏసీ కన్వీనర్ వి.నగేష్, ఎన్ఎస్ఎస్ పీవో ఎన్.షణ్ముఖరావు అభినందించారు.

బియ్యం పంపిణీ

విజయనగరం: ఆకలితో ఏ కుటుంబం అలమటించ రాదని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణ మూర్తి అన్నారు. సంఘం కార్యాలయంలో 108 మంది పేదలకు బియ్యం మంగళవారం పంపిణీ చేశారు. కార్య క్రమంలో ప్రముఖ వస్త్ర వ్యాపారులు మాటూ రు మురళీకృష్ణ, నూకరత్నం పాల్గొని బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘానికి రూ.10 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హోటల్ అజంతా యాజమాన్యంపై చర్యలు

- పోలీసులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు



బాధిత బాలికను పరామర్శిస్తున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: నగరంలోని మూడు లాంతర్ల సమీపంలో నిర్వహిస్తున్న హోటల్ అజంతా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు పోలీసులను కోరారు. తనపై అసభ్యకరంగా ప్రవర్తించి అమానుషంగా దాడి చేశారని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఓ బాలిక మంగళవారం ఫిర్యాదు చేసింది. ఈమేరకు స్పందించిన కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సిబ్బందితో కలిసి సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎవరైనా, ఎక్కడైనా బాలలను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట డీసీపీయూ అల్లు సత్యనారాయణ, యాళ్ల నాగరాజు ఉన్నారు.

డిజిటల్ శిక్షణతో నాణ్యమైన బోధన



రాజాం జీఎంఆర్ఐటీలో శిక్షణ ఇస్తున్న ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ శిక్షణతో ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన చేసేందుకు అవకాశం ఉంటుందని జీఎంఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రప్రభుత్వం అమలు చేయనున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానెల్స్ ఉపయోగం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానెల్స్ ద్వారా బోధన, పాఠశాల విద్యార్థులకు సమకూర్చిన బైజూస్ యాప్‌లోని కంటెంట్‌ను ఈ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానల్స్ ద్వారా బోధించే అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ సామర్థ్యాన్ని, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వినియోగించాలని సూచించారు. ఈ డిజిటల్ బోధన అందుకు ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ బ్రహ్మయ్య, కోర్సు డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ, ఫెసిలిటేటర్స్ కుమారాపు చంద్రునాయుడు, ప్రసాద్, ట్రైనర్స్ సతీష్, రవికిశోర్, రాజాం, సీతంపేట, వీరఘట్టం, జియమ్మవలస మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు 360 మంది పాల్గొన్నారు.